

సీపీని కలిసిన కాజీపేట, పరకాల, మామునూర్ ఏసీపీలు

## సీపీని కలిసిన కొత్త ఏసీపీలు

సుబేదారి, జూలై 19: ఇటీవల కొత్తగా నియామకమైన ఏసీపీలు బుధవారం హనుమకొండలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సీపీ ఏవీ రంగనాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఏసీపీలుగా పి.డేవిడ్‌రాజ్(కాజీపేట), కె.కిశోర్ (పరకాల), సి.సతీష్‌బాబు (మామునూర్) బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు సీపీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రానున్న ఎన్నికల్లో సమర్థంగా విధులు నిర్వర్తించాలని, బాధితులకు న్యాయం చేయడంలో పారదర్శకంగా వ్యవహరించాలని సీపీ వారికి సూచించారు.

## కేయూసీ సీఐగా అబ్బయ్య



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ అబ్బయ్య

నయీంనగర్, జూలై 19: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ కొత్త ఎస్‌హెచ్‌వోగా ముసుగు అబ్బయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు. ఇక్కడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన పత్తిపాక దయాకర్ ఇటీవల భూవివాదంలో తలదూర్చి సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి స్టేషన్లలో కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలోనే భూదందాలు ఎక్కువగా జరుగుతాయి. సీఐ దయాకర్ సస్పెండ్ అయినప్పటి నుంచి భూ దందాల కేసులు పేరుకుపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సీఐ అబ్బయ్య వచ్చినందున వాటికి పరిష్కారం లభిస్తుందేమోనని బాధితులు ఎదురుచూస్తున్నారు. ఆయన్ను వివరణ కోరగా భూదందాల విషయంలో ఎవరూ దళారులను నమ్మొద్దని, నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే తగిన న్యాయం చేస్తామని తెలిపారు.

## శ్వేతార్కలో ప్రత్యేక అలారం సిస్టం ప్రారంభం



ప్రత్యేక అలారంను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్

కాజీపేట, జూలై 19: కాజీపేట పట్టణంలోని శ్వేతార్క మూల గణపతి దేవాలయంలో బుధవారం ప్రత్యేక అలారం సిస్టం ఏర్పాటు చేశారు. దేవాలయ కార్యకర్త గంగుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ యంత్రాన్ని 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆలయంలో భక్తుల సహకారంతో ఈ సిస్టం సమయాన్ని అనుసరించి గంటలు కొట్టడం, ఒక భగవద్గీత శ్లోకాన్ని వినిపిస్తుందని తెలిపారు. భక్తులు సమయం తెలుసుకోవడం వీలవుతుందన్నారు. కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపక చైర్మన్ వెంకటేశ్వర్లు శర్మ, మేనజర్ లక్కు రవి, అసిస్టెంట్ మేనేజర్ దుర్గం సుధీర్, ఎలక్ట్రీషన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బుద్ధ భవన్ పునర్నిర్మాణానికి కృషి

- ఒక రోజు కూలిగా భాగస్వామినవుతా
- భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం
- చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



బుద్ధభవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

హనుమకొండ చౌరస్తా, జూలై 19: గొప్ప చరిత్ర కలిగిన కుమార్‌పల్లి బుద్ధభవన్ పునర్నిర్మాణానికి కృషి చేస్తానని చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. బుధవారం హనుమకొండ కుమార్‌పల్లి బుద్ధ భవన్‌లో పునర్నిర్మాణంపై బుద్ధభవన్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చీఫ్ విప్ తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కామ్రేడ్ బీఆర్ భగవాన్‌దాస్ చిత్రపటాలకు పులమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సమావేశంలో వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల చరిత్ర గల బుద్ధభవన్ అందరికీ ఉద్యమ వారధిగా, చైతన్య వేదికగా నిలిచిందన్నారు. రూ.50లక్షలతో బుద్ధభవన్ పునర్నిర్మాణం చేపట్టనున్నట్లు, జీ ప్లస్ వన్ నిర్మించి ఇక్కడి జ్ఞాపకాలను గుర్తుచేసుకునేలా ఏర్పాటు చేయాలని కమిటీని కోరారు. బుద్ధ భవన్ కమిటీ ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ శంకర్ అనుభవజ్ఞులను తీసుకువచ్చి నిర్మించాలని, అందుకోసమే ఇక్కడికి డీఈ, ఏఈలను పిలిపించినట్లు చెప్పారు. బుద్ధ భవన్ పునర్నిర్మాణంలో ఒక రోజు కూలిగా ఇటుకలు మోసి తనవంతుగా భాగస్వామి అవుతానని అన్నారు. బుద్ధ భవన్ భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా యాత్ భవన్‌ను సందర్శించి, పునర్నిర్మాణానికి కృషిచేస్తానని చెప్పారు. బుద్ధభవన్ అభివృద్ధి కమిటీ కార్యదర్శి వంగల సుదర్శన్, బుద్ధ భవన్ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు బీఆర్ లెనిన్, కార్యదర్శి గోకారపు శ్యాంకుమార్, ముఖ్య సలహాదారులు అంకేసరపు సారయ్య, కన్వీనర్ కునమల్ల జితేందర్, సభ్యులు గొర్రె రవీందర్ ఆర్కిటెక్చర్, యాళ్ల సంజయ్‌కుమార్, బూజుగుండ్ల అరుణోదయ పాల్గొన్నారు.



వంగపల్లి రైతువేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



మల్లిపెల్లిగూడెంలో సీఎం, కౌశిక్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం

# రైతుల కోసం పనిచేసే పార్టీ బీఆర్ఎస్

### వంగపల్లి రైతు సమావేశంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్, జూలై 19 : రైతుల కోసం పనిచేసే ఏకైక పార్టీ భారత రాష్ట్ర సమితి అని ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంటు వ్యాఖ్యలపై బుధవారం మండలంలోని వంగపల్లి రైతు వేదికలో మల్లిపెల్లిగూడెం, మల్లిపెల్లి, జూజునూర్‌పల్లి, పంగిడిపల్లి, వంగపల్లి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కరెంట్ కోతలతో పడిన ఇబ్బందులను రైతులు ఇప్పటికీ మరిచిపోలేదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు కాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. దేశంలోనే రైతుల కోసం పనిచేసే ఏకైక ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు అని చెప్పారు. రేవంత్‌రెడ్డి రైతుల వ్యతిరేకి అన్నారు. రైతులకు 24గంటల కరెంట్ ఇస్తున్న కేసీఆర్ కావాలా? 3గంటల కరెంట్ చాలు అన్న కాంగ్రెస్ కావాలా? మత చిచ్చు పెట్టే బీజేపీ కావాలో ఆలోచన చేయాలన్నారు. సర్పంచ్‌లు పోడేటి కమలమ్మ, ఇనుగాల కిరణ్మయి, చందుపట్ల రజిత, ఎంపీపీ రాణి, జడ్పీటీసీ కల్యాణి, సింగిల్‌విండో చైర్మన్ సంపత్‌రావు, ఎంపీటీసీ రామస్వామి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు తడక శ్రీకాంత్, లాండిగ లక్ష్మణ్‌రావు, విజయ్, సారయ్య పాల్గొన్నారు.

### పేదలను ఆదుకునేందుకే ఇండ్ల స్థలాలు

పేదలకు నివేశన స్థలాలు అందించడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వంగపల్లి రైతువేదికలో మల్లిపెల్లిగూడెం 81మంది, వంగపల్లి 51మంది లబ్ధిదారులకు నివేశన స్థలాల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నివేశన స్థలాల సమస్యను పరిష్కరించి లబ్ధిదారులకు ఇచ్చినట్లు తెలిపారు. ఈటల రాజేందర్ ఏనాడూ పేదల కోసం ఆలోచన చేయలేదన్నారు. పేదల కోసం పనిచేసిన ప్రభుత్వాన్ని మరిచిపోవద్దని కోరారు. అలాగే ఉప్పల్, మల్లిపెల్లిగూడెం, వంగపల్లికి చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కాగా, మల్లిపెల్లిగూడెంలో 20 ఏండ్లుగా లబ్ధిదారులకు నివేశన స్థలాల పట్టాలు అందజేయగా సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి అభిమానం చాటుకున్నారు. ఎంపీపీ రాణి, జడ్పీటీసీ కల్యాణి, సింగిల్‌విండో చైర్మన్ సంపత్‌రావు, సర్పంచ్‌లు పోడేటి కమలమ్మ, ఇనుగాల కిరణ్మయి, ఎర్రబెల్లి దేవేందర్‌రావు, ఎంపీటీసీలు రామస్వామి, సంపత్‌రావు, తహసీల్దార్ రాణి ఉన్నారు.

# ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలి

### హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ, జూలై 19: రానున్న సాధారణ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులతో నియోజకవర్గ స్థాయి మాస్టర్ శిక్షకులకు, బూత్ స్థాయి అధికారులకు, ఫొటో ఎలక్టోరల్ రోల్ స్పెషల్ సమ్మరీ రివిజన్-2023పై శిక్షణ, అవగాహన కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సమర్థమైన, స్పష్టమైన ఎలక్టోరల్ రోల్‌ను తయారు చేయాలన్నారు. గత ఎన్నికల్లో తక్కువ శాతం ఓటింగ్ నమోదైన పోలింగ్ స్టేషన్ల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఓటింగ్ శాతం పెంచేందుకు విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. పారదర్శకమైన ఎన్నికల జాబితా తయారు చేయాలని, ఓటర్ల జాబితాలో మార్పులు చేయడంలో జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రతిసారి చేసే సమ్మరీ రివిజన్‌లో లోటుపాట్లు సరిదిద్దుకొని ఏ దశలోనూ తప్పిదాలకు తావులేకుండా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్లను సందర్శించి అన్ని సౌకర్యాలు ఉన్నాయా లేదా చూసుకోవాలన్నారు. పొలిటికల్ పార్టీ కార్యాలయాలకు 2 కిలోమీటర్ల దూరంలో, ఓటర్లకు సమీపంగా పోలింగ్ కేంద్రాలు ఉండేలా జాగ్రత్త తీసుకోవాలని చెప్పారు. చనిపోయిన ఓటర్లను మరణ ధ్రువీకరణ పత్రాన్ని పొంది, కుటుంబ సభ్యుల ద్వారా వాకబు చేసిన తర్వాతే ఓటరు జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. అనాథలు, ఒంటరి, కూలీ కోసం ఊరూరు తిరిగే వారి వివరాలను సేకరించి వారి స్థిర చిరునామా ఆధారంగా ఓటరుగా నమోదు చేయాలన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని, పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటరుగా ఉన్న ప్రతి ఒక్కరి ఫొటో, వివరాలు సరిగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వికలాంగులు, వృద్ధుల కోసం ర్యాంపులతోపాటు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ఎన్నికల ప్రక్రియపై, బూత్ స్థాయి అధికారుల విధులు, బాధ్యతలు, ఫొటో ఎలక్టోరల్ రోల్స్ 2వ ఎస్ఎస్ఆర్-2023పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. డీఆర్‌వో ఎం.వాసుచంద్ర, సీపీవో సత్యనారాయణరెడ్డి, ఇండస్ట్రీ జీఎం హరిప్రసాద్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జ్యోతి, తహసీల్దార్లు రాజకుమార్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



కంట్రోల్ రూంను తనిఖీ చేస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

## కంట్రోల్ రూంను తనిఖీ చేసిన కమిషనర్

వరంగల్, జూలై 19: వర్షాకాలం నేపథ్యంలో బల్దియా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను బుధవారం కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా తనిఖీ చేశారు. విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఫిర్యాదులను రిజిస్టర్‌లో నమోదు చేయడంతోపాటు ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారంతో కంప్యూటర్‌లో పొందుపరచాలని చెప్పారు. వర్షాకాలంలో వివిధ కాలనీ నుంచి వస్తున్న ఫిర్యాదులను రోజువారీగా అందించాలని ఇన్‌చార్జి అదనపు కమిషనర్‌కు సూచించారు. కంట్రోల్ రూంకు వచ్చిన ఫిర్యాదులను వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్, సూపరింటెండెంట్ ఆనంద్, ఐటీ మేనేజర్ రమేశ్ ఉన్నారు.